### పతకాల పట్టిక

| | దే | స్వ | ర | కా | మొ |
|---|---|---|---|---|---|
| 1 | చైనా | 19 | 14 | 6 | 39 |
| 2 | బ్రిటన్ | 9 | 8 | 5 | 22 |
| 3 | బ్రెజిల్ | 7 | 1 | 9 | 17 |
| 4 | నెదర్లాండ్స్ | 5 | 2 | 1 | 8 |
| 5 | ఆస్ట్రేలియా | 4 | 3 | 4 | 11 |
| 6 | అమెరికా | 3 | 8 | 3 | 14 |
| 22 | భారత్ | 1 | 1 | 3 | 5 |

దే : దేశం, స్వ: స్వర్ణం, ర: రజతం, కా: కాంస్యం మొ: మొత్తం

## రన్నరప్ కార్తీక్ జోడీ



హైదరాబాద్, ఆట ప్రతినిధి: థాయ్‌లాండ్ వేదికగా జరిగిన ఐటీఎఫ్ వరల్డ్ టూర్ టెన్నిస్ టోర్నీలో రాష్ట్ర యువ ప్లేయర్ సాయికార్తీక్‌రెడ్డి సత్తాచాటాడు. శనివారం జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో కార్తీక్, వి శయ జోడీ 7-6(7-5), 4-6, 7-10తో ఆస్ట్రేలియా ద్వయం డెల్ని జేక్, జెస్సీ చేతిలో ఓడింది.

# శభాష్

**10మీ ఎయిర్‌పిస్టల్‌లో కాంస్యం • షూటింగ్‌లో భారత్ పతక జోరు • ఆర్చరీలో శీతల్, సరితకు నిరాశ**



**ప్రతిష్ఠాత్మక పారిస్ పారాలింపిక్స్‌లో భారత షూటర్ల అద్భుత ప్రదర్శన కొనసాగుతున్నది. తమ గురికి తిరుగులేదని నిరూపిస్తూ షూటర్లు పతకాల వేటలో దూసుకెళుతున్నారు. మహిళల 10మీటర్ల ఎయిర్‌పిస్టల్‌లో రుబినా ఫ్రాన్సిస్ కాంస్య పతకంతో మెరిసింది. ఆఖరి షాట్ వరకు హోరాహోరీగా సాగిన పోరులో రుబిన అద్భుత ప్రదర్శన కనబరిచింది. ఆర్చరీలో కచ్చితంగా పతకం సాధిస్తారనుకున్న శీతల్‌దేవి, సరితాదేవికి నిరాశ ఎదురైంది. బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో శివరాజన్, కృష్ణ నాగర్ ఓటమిపాలయ్యారు.**

పారిస్: పారిస్ పారాలింపిక్స్‌లో భారత్ ఖాతాలో మరో పతకం చేరింది. పోటీల రెండో రోజైన శనివారం జరిగిన మహిళల 10మీటర్ల ఎయిర్ పిస్టల్ ఎస్‌హెచ్1 విభాగంలో రుబినా ఫ్రాన్సిస్ కాంస్య పతకంతో సత్తాచాటింది. చివరి వరకు ఆసక్తికరంగా సాగిన పతక పోరులో రుబిన 211.1 పాయింట్లతో మూడో స్థానంలో నిలువగా, డిఫెండింగ్ చాంపియన్ సారెహ్ జావన్‌మర్ది(ఇరాన్, 236.8), ఓజ్గాన్ ఐసెల్(టర్కీ, 231.1) వరుసగా స్వర్ణ, రజత పతకాలు సొంతం చేసుకున్నారు. ఇరాన్ షూటర్‌కు ఇది వరుసగా మూడో పారాలింపిక్స్ పసిడి పతకం కావడం విశేషం. పారాలింపిక్స్ పిస్టల్ ఈవెంట్‌లో పతకం సాధించిన తొలి భారత షూటర్‌గా రుబిన అరుదైన ఘనత సొంతం చేసుకుంది. అర్హత రౌండ్‌లో 556 పాయింట్లతో ఆరో స్థానంలో నిలిచిన ఈ మధ్యప్రదేశ్ యువ షూటర్ పతక పోరులో అదరగొట్టింది. తొలి 10 షాట్లు పూర్తయ్యే సరికి 97.6 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచిన రుబిన..14వ షాట్ పూర్తయ్యే సరికి నాలుగుకు పడిపోయింది. అయితే అద్భుతంగా పుంజుకున్న ఈ యువ షూటర్ రౌండ్ రౌండ్‌కు కీలక పాయింట్లు ఖాతాలో వేసుకుంది. చివరి నిమిషంలో వైల్డ్‌కార్డ్ ద్వారా పారిస్ పారాలింపిక్స్‌కు అర్హత సాధించిన మెకానిక్ కూతురైన రుబిన తన పతక కలను సాకారం చేసుకుంది. మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌కు చెందిన రుబిన..దిగ్గజ షూటర్ గగన్ నారంగ్‌ను స్ఫూర్తిగా తీసుకుంటూ షూటింగ్ కెరీర్ ఎంచుకుంది. తన తండ్రి సైమన్ ఫ్రాన్సిస్..రుబినాకు మద్దతుగా నిలిచారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా...ఎక్కడా వెనుకకు తగ్గకుండా కూతురు షూటింగ్‌లో రాణించేందుకు అన్ని విధాలుగా సహకరించాడు. పారాలింపిక్స్‌లో కాంస్యం గెలిచిన రుబినాను ప్రధాని నరేంద్రమోదీ ప్రత్యేకంగా అభినందించారు.

**శీతల్, సరితకు నిరాశ:**

మహిళల ఆర్చరీలో శీతల్‌దేవి, సరితాదేవికి నిరాశ ఎదురైంది. శనివారం జరిగిన కాంపౌండ్ వ్యక్తిగత క్వార్టర్స్‌లో శీతల్‌దేవి 137-138తో మరియానా జునిగా(చిలీ) పాయింట్ తేడాతో ఓటమిపాలైంది. రెండు చేతులు లేకపోయినా..మొక్కవోని ఆత్మవిశ్వాసంతో శీతల్ కనబరిచిన ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. మరో క్వార్టర్స్‌లో సరితాదేవి 135-141తో ఎలోనెరా సర్టి(ఇటలీ) చేతిలో ఓడింది. బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో శివరాజన్ 12-21, 10-21తో కూంబ్స్(బ్రిటన్) చేతిలో ఓడాడు. మరో సింగిల్స్‌లో కృష్ణ నాగర్ 16-21, 18-21తో మిలెస్ క్రాజెస్కీ(అమెరికా)పై ఓటమిపాలయ్యాడు.



శీతల్



సరిత


# జొకో ఔట్

**మూడో రౌండ్‌లోనే నిష్క్రమణ • అలెక్సీ చేతిలో పరాజయం • యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్**



న్యూయార్క్: సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ యూఎస్ ఓపెన్‌లో సంచలనాల పర్వం కొనసాగుతున్నది. స్పెయిన్ నయా స్టార్ కార్లోస్ అల్కారజ్‌ను అనుసరిస్తూ డిఫెండింగ్ చాంపియన్ నోవాక్ జొకోవిచ్ టోర్నీ నుంచి అనూహ్యంగా నిష్క్రమించాడు. శనివారం జరిగిన పురుషుల సింగిల్స్ మూడో రౌండ్ పోరులో రెండో సీడ్ జొకోవిచ్ 4-6, 4-6, 6-2, 4-6తో 28వ సీడ్ అలెక్సీ పాపిరిన్(ఆస్ట్రేలియా) చేతిలో ఓటమిపాలయ్యాడు. కెరీర్‌లో 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ వేటలో ఉన్న జొకోవిచ్ యూఎస్ ఓపెన్‌లో అనుకోని రీతిలో చుక్కెదురైంది. 2017 తర్వాత మేజర్ టైటిల్ లేకుండానే సీజన్ ముగించడం ఈ సెర్బియా స్టార్‌కు ఇది తొలిసారి. 2002 తర్వాత జొకోవిచ్, నాదల్, ఫెదరర్ లాంటి దిగ్గజాలు గ్రాండ్‌స్లామ్ ట్రోఫీ గెలువకపోవడం ఇది మొదటిసారి కావడం విశేషం. ఈ మధ్యే పారిస్ ఒలింపిక్స్‌లో పసిడి పతకం సాధించిన జొకోవిచ్..కోర్టులో ఒకింత అలసటగా కనిపించాడు. 3 గంటల 20 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో అంతగా ఆకట్టుకోలేకపోయాడు. తొలి రెండు సెట్లను ప్రత్యర్థికి కోల్పోయిన జొకో..మూడో సెట్‌లో పుంజుకున్నా ఫలితం లేకపోయింది. మ్యాచ్‌లో 16 ఏస్‌లు కొట్టిన జొకో 14 డబుల్ ఫాల్ట్స్ చేయగా, 16 బ్రేక్ పాయింట్లలో నాలుగే కాపాడుకున్నాడు. మరోవైపు నెట్‌గేమ్‌తో ఆకట్టుకున్న అలెక్సీ 36 వ్యాలీస్‌లో 26 పాయింట్లు రాబట్టాడు. 50 విన్నర్లు కొట్టిన పాపిరిన్..జొకోను దీటుగా నిలువరించాడు. మిగతా మ్యాచ్‌ల్లో జ్వెరెవ్ 5-7, 7-5, 6-1, 6-3తో మార్టిన్ ఎట్చెవరిపై, ఫ్రిట్జ్ 6-3, 6-4, 6-2తో కొమెసెనాపై, రుబ్లెవ్ 6-3, 7-5, 6-4తో లెహెకాపై గెలిచారు. పురుషుల డబుల్స్‌లో రోహన్ బోపన్న, మాథ్యూ ఎబ్డెన్ జోడీ 6-2, 6-4తో కార్బెలాస్ బెనా, కొరియా ద్వయంపై గెలిచి ప్రిక్వార్టర్స్ చేరింది. మరో మ్యాచ్‌లో శ్రీరామ్, అండ్రెజీ జంట 6-7(4/7), 4-6తో నీల్ సుపుస్కి, వీనస్ ద్వయం చేతిలో ఓడింది.

## రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు షురూ



భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 31: రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలు శనివారం భూదాన్‌పోచంపల్లి మండలం జూలూరు గ్రామంలో ప్రారంభమయ్యాయి. పోటీలను అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు శృతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని 28 జిల్లాల నుంచి 200 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. టోర్నమెంట్‌లో యూత్, జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని, ఈ పోటీల్లో రాణించిన వారిని జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక చేస్తామని చెప్పారు.

# ఆర్య, బదోని వీరవిహారం

- **ధనాధన్ సెంచరీలతో విజృంభణ**
- **సౌత్‌ఢిల్లీ సూపర్‌స్టార్స్ 308/5**
- **ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో పరుగుల వరద**



ప్రియాంశ్ (120)

న్యూఢిల్లీ: ఢిల్లీ ప్రీమియర్ లీగ్(డీపీఎల్)లో పరుగులు సునామీలా పోటెత్తాయి. బౌండరీలు చిన్నబోయేలా బ్యాటర్లు దుమ్మురేపారు. బౌలర్లను తుత్తునియలు చేస్తూ సౌత్ ఢిల్లీ సూపర్‌స్టార్స్ బ్యాటర్లు ఆయూశ్ బదోని (55 బంతుల్లో 165, 8ఫోర్లు, 19 సిక్స్‌లు), ప్రియాంశ్ ఆర్య(50 బంతుల్లో 120, 10ఫోర్లు, 10 సిక్స్‌లు) ధనాధన్ సెంచరీలతో విజృంభించారు. లీగ్‌లో భాగంగా శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో వీరిద్దరి సూపర్ సెంచరీలతో నార్త్ ఢిల్లీ స్ట్రైకర్స్‌పై సౌత్ ఢిల్లీ నిర్ణీత 20 ఓవర్లలో 308/5 భారీ స్కోరు నమోదు చేసి 112 పరుగులతో ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. ఓవరాల్‌గా టీ20 క్రికెట్ చరిత్రలో ఇది రెండో అత్యుత్తమ స్కోరుగా రికార్డుల్లోకెక్కింది. టీ20ల్లో మంగోలియాపై నేపాల్ 314/3 స్కోరు అగ్రస్థానంలో ఉంది. మ్యాచ్ విషయానికొస్తే..ప్రియాంశ్ ఆర్య, ఆయూశ్ బదోని ఆకాశమే హద్దుగా చెలరేగారు. బదోని ఏకంగా 19 సిక్స్‌లతో చెలరేగితే తానేం తక్కువ కాదన్నట్లు ఆర్య 50 బంతుల్లోనే 120 పరుగుల మార్క్ అందుకున్నాడు. ఈ క్రమంలో మనన్ భరద్వాజ్ వేసిన 12వ ఓవర్‌లో ఆర్య ఆరు బంతుల్లో ఆరు సిక్స్‌లతో విరుచుకుపడ్డాడు. దీంతో రెండో వికెట్‌కు వీరిద్దరు కలిసి 286 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. టీ20ల్లో ఏ వికెట్‌కైనా ఇది అత్యుత్తమ పార్ట్‌నర్‌షిప్. భారీ లక్ష్యఛేదనకు దిగిన నార్త్‌ఢిల్లీ 20 ఓవర్లలో 196/8 స్కోరుకు పరిమితమైంది. ప్రయాంశు(62) టాప్‌స్కోరర్‌గా నిలిచాడు. రాఘవ్‌సింగ్(3/34) మూడు వికెట్లతో ఆకట్టుకున్నాడు.

# జూనియర్ ద్రవిడ్ వచ్చేశాడు..

**భారత అండర్-19 జట్టులోకి సమిత్**




న్యూఢిల్లీ: భారత క్రికెట్ దిగ్గజం రాహుల్ ద్రవిడ్ కొడుకు సమిత్ ద్రవిడ్..అండర్-19 జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. ఆస్ట్రేలియాతో సిరీస్‌ల కోసం బీసీసీఐ జూనియర్ జట్లను శనివారం ప్రకటించింది. గత కొంతకాలంగా సమిత్ ద్రవిడ్ నిలకడగా రాణిస్తున్నాడు. ప్రస్తుతం జరుగుతున్న మహారాజా టీ20 ట్రోఫీలో బెంగళూరుకు ఆడుతున్న సమిత్ 82 పరుగులతో ఆకట్టుకున్నాడు. కర్ణాటక జట్టు కూచ్‌బెహార్ ట్రోఫీ విజేతగా నిలువడంలో సమిత్ కీలకంగా వ్యవహరించాడు. బ్యాటింగ్‌కు తోడు ఉపయుక్తమైన పేస్ బౌలర్‌గా జూనియర్ ద్రవిడ్ ఆసీస్‌తో సిరీస్‌లో కీలకంగా మారే అవకాశముంది. ఇదిలా ఉంటే పుదుచ్చేరి వేదికగా ఈనెల 21, 23, 26 తేదీల్లో ఆసీస్‌తో వన్డే సిరీస్ జరుగనుండగా, సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ 7 వరకు నాలుగు రోజుల మ్యాచ్‌లకు చెన్నై వేదిక కానుంది.

# మెహదీ పాంచ్ పటాకా



రావల్పిండి: బంగ్లాదేశ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో ఆతిథ్య పాకిస్థాన్ ఘోరంగా తడబడింది. వర్షం కారణంగా తొలి రోజు ఆట రద్దు కాగా, రెండో రోజైన శనివారం బంగ్లా స్టార్ స్పిన్నర్ మెహదీహసన్(5/61) ధాటికి పాక్ తొలి ఇన్నింగ్స్‌లో 274 పరుగులకు ఆలౌటైంది. సయిమ్ ఆయూబ్(58), కెప్టెన్ షాన్ మసూద్(57), సల్మాన్ ఆగా(54) అర్ధసెంచరీలతో ఆకట్టుకున్నారు. పరుగుల ఖాతా తెరువకుండానే ఓపెనర్ షఫీక్(0)వెనుదిరుగగా, లోయార్డర్ తీవ్రంగా తడబడింది. పిచ్ పరిస్థితులను సద్వినియోగం చేసుకుంటూ మెహదీహసన్ ఐదు వికెట్లు ఖాతాలో వేసుకోగా, తస్కిన్ అహ్మద్(3/57) రాణించాడు. ఆ తర్వాత తొలి ఇన్నింగ్స్‌కు దిగిన బంగ్లా 10 పరుగులు చేసింది.



Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.